





కోట్లకు పడగలెత్తుతున్న వ్యాపారులు

చెరువుల్లో మట్టిని తోడేస్తున్న అక్రమార్కులు

మామూళ్ల మత్తులో అధికారులు

బెజ్జంకి చెరువుకు పొంచి ఉన్న ముప్పు

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు

రోజుకు వందల లారీల్లో అక్రమంగా తరలింపు

# తోడేళ్లు..




తెలంగాణ క్యాపిటల్

EXCLUSIVE

EVENING EDITION

www.telanganacapitalnews.com

15.06.2024


(తెలంగాణ క్యాపిటల్ ప్రతినిధి, సిద్దిపేట/బెజ్జంకి)

ఉమ్మడి జిల్లా కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లో మట్టిదందా జోరుగా సాగుతోంది. డబ్బుల సంపాదనే లక్ష్యంగా.. నిబంధనలకు విరుద్ధంగా పలువురు పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారు. అక్రమ దందాకు పాల్పడుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు. వేసవి కాలం వస్తే చాలు అధికారుల అండదండలతో కొందరు వ్యక్తులు చెరువులో మట్టిని కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరు మట్టిని తరలించేందుకు రోడ్డు మార్గాలు సమీపంలో ఉన్న చెరువులను ఎంపిక చేసుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకిలోని చెరువులో కొందరు వ్యక్తులు స్థానిక నాయకుల అండదండలతో మట్టిని తోడేస్తున్నారు. జేసీబీలు, దాదాపు ఇరవైకి పైగా ట్రాక్టర్లు, వందల సంఖ్యలో లారీల సహాయంతో మట్టిని తరలిస్తున్నారు. వీరికి అధికార పార్టీకి చెందిన నాయకులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి అండతోనే మట్టి దందాకు అడ్డు అదుపు లేకుండాపోతోంది. క్యూబిట్ మీటర్లలో అనుమతులు పొందినట్లు చూపుతూ రోజు వందలాది లారీల్లో మట్టిని తరలిస్తున్నారు. అధికారులు సైతం మామూళ్ల వ్యవస్థకు అలవాటు పడడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

## రాత్రి, పగలు తేడా లేకుండా..

బెజ్జంకి పరిధిలో చెరువులో మట్టిని పగలు, రాత్రి అనే తేడా లేకుండా కొన్ని ట్రాక్టర్ల ద్వారా లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. అధికారులకు ముడుపులు ముట్టడంతోనే నిశ్శబ్దంగా ఉంటున్నారని ప్రజలు అనుకుంటున్నారు. ఒక్కొక్క ట్రిప్పుకు దాదాపు వేల రూపాయలు తీసుకుంటున్నారని, అందులో కొంత పెద్ద మొత్తంలో అధికారులకు వాటా పోతోందని గ్రామ ప్రజలు అనుకుంటున్నారు. పర్మిషన్ లేకుండా మట్టి దందాను కొనసాగిస్తున్నా అటు వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు అని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సహజ వనరులైన చెరువుల మట్టిని ఇష్టారాజ్యంగా తోడుకుంటున్న వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకొని ఈ దందాను అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. వారం రోజులే పర్మిషన్ ఉంటుంది. కానీ రోజుల తరబడి కొడుతూనే ఉంటారు. అందులోనూ.. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే మట్టి తరలించాలని నిబంధన ఉంటుంది. కానీ.. అర్ధరాత్రుల్లో ఆ దందా మరింత ఎక్కువగా నడిపిస్తున్నారు.

## వే బిల్లులు కరువు

సాధారణంగా చెరువు లేదా కుంట నుంచి మట్టి తరలించాలంటే గ్రామ పంచాయతీలో తీర్మానం చేయాల్సి ఉంటుంది. దాని ద్వారానే పర్మిషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే.. బెజ్జంకి పరిధిలో తరలిస్తున్న మట్టికి పర్మిషన్ తీసుకోలేదని సమాచారం. ఒకవేళ పర్మిషన్ తీసుకున్నప్పటికీ నిబంధనల ప్రకారం వెయ్యి క్యూబిక్ లేదా రెండు వేల క్యూబిక్ లకు పాలకులు ఇస్తారు. అంతకుమించి తోడేందుకు వారికి ఎలాంటి హక్కు ఉండదు. కానీ.. నిబంధనలన్నింటినీ బేఖాతరు చేస్తూ లక్ష క్యూబిక్ మీటర్లకు పైగా తోడేస్తున్నారు. వీరు తీసుకున్న పర్మిషన్ కు సుమారు 50 లారీల ట్రిప్పులతో కథ ముగుస్తుంది. కానీ.. ఈ అక్రమార్కులు మాత్రం రోజుల తరబడి తరలిస్తూనే ఉన్నారు. రోజుకు సుమారు 200 నుంచి 300 లారీల్లో మట్టిని కొడుతున్నారు. అయితే.. దీనికి సంబంధించి అధికారులు కానీ, పంచాయతీ పాలకవర్గం కానీ బిల్స్ మెయింటెన్ చేయడం లేదు. రోజుకు ఎన్ని లారీలు పోతున్నాయి..? వాటి నంబర్లు ఏంటి..? అనేది నోట్ చేయాలి. లారీ ఏ టైమ్ లో వచ్చింది..? ఏ టైమ్ లో బయటికి వెళ్లింది..? అనేది కూడా రికార్డు చేయాలి. కానీ.. ఈ నిబంధనలు ఇక్కడ అమలు కావడం లేదు.

## పట్టించుకోని స్పెషలాఫీసర్లు..

ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన నడుస్తోంది. దీంతో అక్రమార్కులకు ఇది మరింత అవకాశంగా మారింది. గతంలో పాలకవర్గం ఉన్నప్పుడు సర్పంచ్ లేదంటే వార్డు సభ్యుల పర్యవేక్షణ అంతో ఇంతో ఉండేది. కానీ.. ఇప్పుడు ప్రత్యేక అధికారి పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. మరోవైపు సెక్రటరీ ఉన్నప్పటికీ ఆయన బిజీలో ఆయనే. దాంతో బెజ్జంకిలో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. అటు.. ప్రత్యేకాధికారులను సైతం మచ్చిక చేసుకున్నట్లుగా ప్రజలు గుసగుసలాడుతున్నారు. అందుకే.. జీపీ పర్మిషన్ లేనప్పటికీ యథేచ్ఛగా వందలాది లారీల్లో మట్టిని తరలిస్తున్నట్లుగా చెప్తున్నారు.

## కమర్షియల్‌గా సొమ్ము చేసుకుంటూ..

ఇవన్నీ ఇలా ఉంటే.. చెరువుల్లో నుంచి తీసిన మట్టిన కేవలం పొలాల్లోకి మాత్రమే తరలించాలి. కానీ.. అలా కాకుండా ఇటుక బట్టీలు, తదితర వాణిజ్యం కోసం మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామం నుంచి తీసిన మట్టి అదే గ్రామానికి చెందిన రైతులకు ఉపయోగపడాలని నిబంధనలు ఉన్నా.. రోజూ బెజ్జంకి దాటి పోతూనే ఉంది. మామూళ్ల మత్తులో చెరువు మట్టికి చిల్లు పెడుతున్నారు. బెజ్జంకి మండల కేంద్రంలో చెరువులోని నల్ల మట్టికి భారీ గిరాకీ ఏర్పడింది. అందుకే అక్రమార్కులంతా కమర్షియల్‌గా విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. భారీ మొత్తంలో సారవంతమైన చెరువు నల్ల మట్టి వ్యవసాయేతర అవసరాలకు విచ్చలవిడిగా తరలిస్తున్నారు. ఇది దేనికి సంకేతం అని, ఇకనైనా అధికారులు మొద్దు నిద్ర వదిలి చట్ట వ్యతిరేక కార్యకలాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేనిపక్షంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్షకు దిగుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## అధికారులు ఎక్కడ..?

చెరువులో నుంచి మట్టి తీసేటప్పుడు ఎమ్మార్వో ఆఫీస్ సర్వేయర్, ఇరిగేషన్ ఆఫీస్ సర్వేయర్ అందుబాటులో ఉండాలి. కానీ ఎవరూ ఉండడం లేదు. ఇంత వరకు మట్టి తీస్తే చెరువుకు, కుంటకు ఎలాంటి నష్టం లేదని వారు తేల్చాలి. కానీ.. వీరి అవసరం లేకుండానే అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు.. ఆయా విభాగాలకు చెందిన అధికారులను మచ్చిక చేసుకొనే ఇదంతా నడిపిస్తున్నానే విమర్శలు సైతం ఉన్నాయి.

## చెరువుకు పొంచి ఉన్న ముప్పు..

నిబంధనలకు మించి మట్టిని తవ్వుతుండడంతో బెజ్జంకి చెరువుకు ప్రమాదం పొంచి ఉంది. నిత్యం లక్షలాది క్యూబిక్‌లలో మట్టిని తోడుతుండడంతో చెరువు పరిస్థితిని ఆలోచించే వారు కరువయ్యారు. పట్టించుకోవాల్సిన అధికారులు అమ్యామ్యాలకు అలవాటు పడడం.. పాలకవర్గం లేకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట.. పాడిందే పాటలా నడుస్తోంది. పర్యావరణానికి ముప్పు పొంచి ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడని స్థానిక ప్రజలు సైతం అంటున్నారు.

## పెద్దపల్లి జిల్లాలోనూ జోరుగా..

పెద్దపల్లి జిల్లాలోని పలు చెరువుల్లో అక్రమ మట్టి దందా జోరుగా సాగుతున్నది. మంథని, రామగుండం నియోజకవర్గాల్లోని చెరువుల్లోనూ ఇష్టారాజ్యంగా తోడుతున్నారు. రాజకీయ అండదండలతో చెరువులను దక్కించుకున్న ఇటుక బట్టీల యజమానులు అనుమతులకు మించి మట్టి తీసి చెరువులను కొల్లగొడుతున్నారు. ఎక్కడికక్కడే సంబంధిత అధికారులను మచ్చిక చేసుకొని దందాను యథేచ్ఛగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి వే బిల్లులు లేకుండా చెరువుల నుంచి నేరుగా మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి, ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతూ మట్టిని తరలించుకుపోతున్నారు. ప్రభుత్వానికి పన్నులు సైతం చెల్లించడం లేదు.

NEW COLLECTORS


కరీంనగర్ కలెక్టర్ అనురాగ్ జయంత్


జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్


సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్


పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

# కలెక్టర్ల బదిలీ

**నాలుగు జిల్లాల ఐఏఎస్‌లను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు**
**కరీంనగర్‌కు అనురాగ్ జయంతి.. పెద్దపల్లికి కోయ శ్రీహర్ష**
**సిరిసిల్లకు సందీప్ కుమార్ ఝా.. జగిత్యాలకు సత్యప్రసాద్**
**ఒకేసారి అందరిని బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం**

(తెలంగాణ క్యాపిటల్ బ్యూరో, కరీంనగర్)
రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా సంచలన నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాలోని నలుగురు కలెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకేసారి నలుగురు కలెక్టర్లు బదిలీ కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఇప్పటివరకు కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పమేలా సత్పతి స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నియామకం అయ్యారు. అలాగే.. రాజన్న సిరిసిల్లకు సందీప్ కుమార్ ఝా కొత్త కలెక్టర్‌గా వస్తున్నారు. అటు.. పెద్దపల్లి కలెక్టర్ ముజ్మిల్లా ఖాన్ ఖమ్మం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కోయ శ్రీహర్ష వస్తున్నారు. ఇక.. జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా సైతం ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆమె స్థానంలో సత్యప్రసాద్ రాబోతున్నారు. నలుగురు కలెక్టర్లు సైతం ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. ఎన్నికలను ఎదుర్కోవడం ఎంతో పెద్ద టాస్క్ అయినప్పటికీ అంతే సింపుల్‌గా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూర్తిచేయగలిగారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, ఇల్లంతకుంట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శనిగరం చంద్రయ్య తండ్రి మల్లయ్య రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. శనివారం గొడిశెల జితేందర్ గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేల నగదు, 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మీసరగండ్ల అనిల్ కుమార్, గన్నేరం నర్సయ్య, రేగుల బిక్షపతి, ల్యాగల బాగయ్య, ఎలవేణి రమేశ్, పసుల రాజు, బైండ్ల మల్లేశం, గన్నేరం లచ్చయ్య, కరికె మహేశ్, శనిగరం చంద్రయ్య, శనిగరం కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పెళ్లి చేసుకున్న కూతురు.. షాకిచ్చిన తల్లిదండ్రులు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, శంకరపట్నం:** ప్రేమ పెళ్లి చేసుకున్న కూతురికి తల్లిదండ్రులు షాక్ ఇచ్చారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో మమత అనే అమ్మాయి అదే గ్రామానికి చెందిన రత్నాకర్ ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే రత్నాకర్ ఇంటికి ఎవరైనా వెళ్లాలంటే మమత ఇల్లు దాటి వెళ్లాలి. ప్రేమ పెళ్లి చేసుకుందని రగిలిపోతున్న మమత తల్లిదండ్రులు రత్నాకర్ ఇంటి వెళ్లే దారిలో ఏకంగా గోడ కట్టేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## అత్యాచార నిందితుడిని బహిరంగంగా శిక్షించాలి

**సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్**



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ పెద్దపల్లి:** రైస్ మిల్లులలో తక్కువ వేతనాలకు ఇతర రాష్ట్రాల్లో ఉండే కార్మికులను తీసుకొచ్చి ఎలాంటి నిబంధనలు పాటించకుండా పరిచయం లేని వారిని తీసుకొని పని చేయించుకుంటున్న యాజమాన్యాలు అక్కడ ఏం జరిగినా పట్టించుకోని అధికారులు ప్రతి సంవత్సరం ఏదో ఒక ఘటన జరుగుతూనే ఉందని అయినా కఠినమైన చర్యలు తీసుకోవడం లేదని సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. గత సంవత్సరం ఇటిక బట్టీలలో బాలిక పైన ఇదే రకమైన దుశ్చర్య జరిగింది అయినా అధికారులు పోలీసు యంత్రాంగం కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతో నేరస్థులకు భయం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రం నుండి కార్మికులను తీసుకువచ్చినప్పుడు వారికి సంబంధించిన వివరాలు సంబంధించిన అధికారుల వద్ద పోలీస్ సిబ్బంది వద్ద లేకపోవడం కూడా ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నాయని యాజమాన్యాల పైన నిందితులపైన వెంటనే కేసు పెట్టి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితున్ని బహిరంగంగా శిక్షించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని రైస్ మిల్లు యాజమాన్యాల పైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రైవేట్ విద్యాసంస్థలలో 100శాతం ఫీజు రాయితీ అందించాలి



కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేత

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** ప్రైవేట్ విద్యాసంస్థలలో 100శాతం ఫీజు రాయితీ అందించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొమ్మెర తిరుపతి రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కరోనా కాలం నుండి జర్నలిస్టులు ఆర్థికంగా అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వచ్చిరాని లైన్ అకౌంట్లు, జీతాలతో జీవితాన్ని నెట్టుకొచ్చే ఈ పరిస్థితుల్లో పిల్లల ఫీజులు, పుస్తకాలు, బట్టలు, ఆరోగ్య సమస్యలు మరింత భారమవుతున్నాయన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలలో 100 శాతం ఫీజు రాయితీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయందర్, చట్ల శంకర్, రాజకుమార్, సతీష్ పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



## ఎస్సైకి సత్కారం

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామగుండం:** జీడీ నగర్ టోల్ గేట్ వద్ద గోవులను గోవధకు తరలిస్తున్న వాహనాలను పట్టుకొని వారిపై చర్యలు తీసుకొని గోవులను సురక్షితమైన తరలించిన బసంత్ నగర్ పోలీస్ ఎస్సైకి, టోల్ ప్లాజా వద్ద తరలిస్తున్న వాహనాలను ముందుగా తెలుసుకుని పట్టుకున్న జిల్లా గార్డ్స్‌ను సన్మానించారు. జీడీ నగర్ గ్రామానికి సంబంధించిన ఈసారపు శివ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. రాష్ట్రీయ హిందూ పరిషత్ గో రక్షక్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల రమేష్, పెద్దపల్లి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు కోమిరే లక్ష్మణ్, ఆడెపు రమేష్, గడ్డం శ్రీనివాస్, రంగు సంతోష్, నక్క శ్రీనివాస్ ఉన్నారు.

## చేనేత కార్మికుడి ఆత్మహత్య

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కొత్తపల్లి:** కొత్తపల్లి మున్సిపల్ పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లికి చెందిన బొల్లబత్తిని వెంకటేశం తండ్రి పేరు ఆనందం సిరిసిల్లలో చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత ఆరు నెలల నుండి పనిలేక మనస్తాపం చెంది కొత్తపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.